# పాలెంలో దీపాలమాశ

ఎల్దురు; బెమ్మాండంగా లెగుత్తండయి మంటలు. సుక్కల్జాత్తుండయి సిచ్చు బుడ్లు. యాడజూసినా ఎఱ్ఱ మతాబులు పచ్చ మతాబులు ముత్తాల పూత్తులు, కాకర పూత్తులు సిలకలు పాలపిట్లలకి మల్లే పటపట బగబగ దలతల మంటంటే, యాది మలుపున మంటపం తంబాన్ని వాటేసుకుని దుష్టి సెదరకండా సూత్తుండ చీతాయి, ఒక్కపాలి ఎగశాస బీల్చి దిగనొదిలేతలికి బొడ్డుకాడ గెజ్జలు గెల్లు మన్నయి నిదర్లో ఎగదోసినట్టు.

“యాడికిబోయినా యియుంటయి నాకు లింగమయ్యకు మల్లే” అంటా మడత మీన మడతేసి గెజ్జల్ని బొడ్డోకి దోపాడు చీతాయి అటిటు సూత్తా.

పొద్దత్తమానం వుత్త రోఁట్రోకల్తో వూరెల్లా దిరిగి, యింటికెల్లి సందేల బువ సరిపడక, సీకటైనాక సల్లగావొచ్చి మంటపం తంబాన్ని వాటేసుకుని సూత్తాండాడు చీతాయి.

మొదులు రోఁట్రోకలి మందు చంగతి అట్టుంచీ, సూరేకారం గెందకం యాడన్నా తంటాలుబడ్డా, యిస్కోల్లో తాడిసెట్టు గులకసళ్ళను సూత్తేనే బాత్తానన్నాడు బుడేసాయిబు.

సీరాములయ్యకొడుకు నారాయన లొల్లి మాటలేగాని ఆల్లయ్య ముప్పావలా ఇత్తే మళ్లీ మరనాడిత్తా ఓపావలా బిల్లియ్యరా అంటే, యదవ యీయలా.

అంత లోతు బాయిలో బిందెబడ్తే, లటిక్కిన మునిగి సావుదప్పి తెచ్చిత్తే ‘ఆనక అగుపియి అర్ధణా యిత్తా’’ అన్నాడు అంకమ్మ. ఓడిగ్గావాలా... ఆయిని పిలక్కి తగిలిచ్చుకోమను–

తుస్ మంది తోటా, కోటయ్యగారింటి మంగల. “యిహి యిహి, కోటయతోటా పిత్తింది!” అన్నాడు చీతాయి.

“అబ్బ, యిదేందమ్మా యాకప్పగంతు మీనకు లెగుసుద్దీ!” అంటన్నారెవురో కోటయ యింటికాడ.

“అదేందో నీకు దెల్సా?” అన్నారు చీతాయి తంబం రుద్దుతా.

“లెగవండి లెగవండి” – అంటున్నారు కోటయ యింటికాడ.

"అరెనాయినా, సిచ్చుబడ్లు ముట్టిత్తుండారా! అబ్బ - అదేందీ? కింద బెట్టా ముట్టిచ్చేదీ? యిగ యీళ్ళేంగాలుత్తారు పూత్తులూ! అట్టా యిప్పుడు పుట్టిన పిల్లో డెలిగిత్తాడు. సిచ్చుబుడ్డి ముట్టిచ్చి సేతిలో పొట్టుకుని లగెత్తుతా వుంటే రవిలుబండికి మల్లే అట్టనే మేగాల్లోకి లెగిసి పోవాల!.......... సల్లగా ఎల్లి ఓ సిచ్చుబుడ్డి దీసుకు లగెత్తికెల్తే? కోటయ గుటకేత్తాడు. రంగమ్మ దిమ్మరపోద్ది! .... సందట్లో ఓడు సూసేది? పదా..." అంటా తంబంకాణుంచి లెగిసి నైగవటం వుండేల్బద్ద కొట్టినట్టు టపీమనొచ్చి సిచ్చుబుడ్డిని ఎగరేసి లెగనేసి తిప్పుకుంటా 'అదేంది? అదేంది? లగెత్తుండది సిచ్చుబుడ్డి-' అని కోటయ మిటా నోళ్ళు దెరుత్తుంటే, ఎల్లిన ఎల్దం సిచ్చుబుడ్డి సల్లార్నా అటనే పొట్టుకుని బసవయగారి సాయిడి కాడి కొచ్చిగాని ఎనిక్కి తిరిగి సూడలా చీతాయి. ఎగరొప్పుతా.

"అబ్బ!" అన్నది ఆడ ఎవుర్దో కంటం.

"వుక్" - మంది చీతాయి గుండె కాడ ఏందో.

"బల్ గమ్మతుగుండది!" అంది కంటం మల్లీ.

"ఆఁ?" అన్నాడు చీతాయి సీకట్లో సూత్తా.

"అదేందిరా? అట్ట అదరగొడ్తివి, చీతాయ్?" అంది కంటం.

"ఎంకాయ్? నువేనంటే-సత్తిని గదంటే అదురుబుట్టీ?"

"ఓడు సావమన్నాడూ!"

"ఏం జేత్తుండావే యీడ, ఎంకాయ్!"

"పా అతలికీ మీనకొత్తావేం?"

"యీడుండా వేందే, ఎంకాయ్?"

'నా యిట్టం, యాడుంటే నీకేం?"

"యాడుండావనుకుంటే యాడా అగుపియకబోతివీ?"

"ఓరికి? నీకా? పోరా-"

"ఎంకాయ్?"

"మాలచ్చను-"

"ఏందీ!"

"ఏందా, పిల్లి మిసరకాయలు-"

"పిల్లి మిసరకాయలూ -ఏందదీ?"

"ఇదేంది యీడ నిలబడ్డానూ, ఎల్లిపోకా-"

"యిదుగో, ఎంకాయోవ్-"

"తాలుందూ - యిడిపియ్ - సెయి పొట్టుకుందావేందీ?"

"ఇదిగో, నువనేదేందో తెలవటంలేదు గానీ కూసిని పిల్లిమిసరకాయలు ఆనాడు మాలచ్చి పెట్ట మనడిగితే పెట్టా? ఏం వుండదాడా?"

"ఏంవుందా?" కొప్పెగర్దన్నే వోళ్లు లేక. ముంగల దానికి నువెందుకు పెట్టాలా?"

"బలేదానివి! కట్టలో సగంకూడా పెట్టలేదు గానీ - పదికాయిలేగా పెట్టింది, నువు సూట్టంలా?"

"సుబ్బాం జెప్పింది."

"లం-అదిగందికే దగిలేది! మద్చిని జూసి సెప్పక్కర్లా ఎవురయినా? అయ్యన్నా పెట్టకనే పొయ్యేవోణ్ణి తెలుత్తె. హు!"

"వూఁ."

"ఎందుకురా, ఎంకాయి అగుపియదనుకుంటే ఎటదెల్చుద్దీ!"

"పోరా."

"నీకు తెలవదంటే, ఎంకాయ్, యీచీతాయి ఎసువంటివోడయిందీ? నువు కాన్రాక వుక్కిరి బిక్కిరయి సత్తంటే!"

"తెల్చుగానీ - యీపాలి ఆ మాలచ్చాంతో మాట్టాణ్ణనూ?"

"ఆ, అంతే."

"వూఁ!"

"యీడ ఒంటరిగా ఏంజేత్తుండావే, ఎంకాయ్?"

"అదిగాదురా, చీతాయ్, అయ్యేవోఁ పూత్తులు కొనియలా. అమ్మనడిగితే నేవోఁ నాకు తెలవదు. మీ అయ్యానే అదుక్కోమంది. ఆమయిన ఏడుత్తా పొందుకుండా."

"నాకు తెలవదే, ఎంకాయ్!"

"ఆమయినేఁవో సందేల జేజి సాటుకుబిల్సీ పావలా బిల్లిచ్చింది!"

"ఎందుకే యిచ్చిందీ?"

"ఎర్ర మతాబులు కొనుక్కోను!"

"మీ జేజి బో మంచిదే, ఎంకాయ్!"

"ఆమయిన రంగయ్యకొట్టుకాడి కెల్తే నీ అయ్య ఆడ పుగాకు కొంటా వుండాడు. సత్తిన్రా బగమంతుడా అనుకుంటా లగెత్తుకొచ్చా. మళ్లీ అయ్య యిప్పుడే బువదాగి

వూల్లోకెల్లాడూ. అమ్మ సూడకుండా యిటు లగెత్తుకొచ్చా. యిగ నువు సిచ్చుబుడ్డితో లగెత్తుకొచ్చావూ, పానం లెగిసొచ్చిందిరా, చీతాయ్!"

"నాకాడ పూత్తుల్లేవు...."

'నే నిత్తాగా. నాకాడ పావలాబిల్లుండది గదంట్రా?"

"మరి నీకు సాలక్కర్లా?"

"పానీలేరా, ఎతుక్కుంటా వత్తేనీ! రావంట్రా కొనుకొచ్చుకుందాం!"

"ఏం కొనుక్కుందాం?"

"ఎఱ్ఱ మతాబూ, పచ్చ మతాబూ – అయ్య రంగయ కొట్టుకాడుంటాడేవోఁ?"

"నే ఎల్లి దీసకరానా?"

"వూఁ. మరి యాడ కాల్చుకుందాం?"

"యాడ కాల్చుకుందాం?"

"నాగార్బొమ్మ గుడికాడ ఎవురూ వుండఱ్రా!"

"ఆడకా.....?"

"అయితే అయిందిలే. బాగుంటదాడా!"

"ఎంకాయ్!"

"దబ్బునపోరా. నే అటు తిరిగొచ్చి, నీ కోసం ఆడ కూకునుంటా, ఏం?"

కూసేపుటికి దూరాన నాగర్బొమ్మ గుడికాడ ఎఱ్ఱెఱ్ఱగా పచ్చ పచ్చగా ఎల్దురు లెగిసింది.